క్లుప్తంగా

ఆర్బీకేల ద్వారా నేటి నుంచి ధాన్యం కొనుగోలు

కర్లపాలెం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కర్లపాలెం ఏఓ సుమంత్ కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. బీపీటీ- 5204 రకం ధాన్యం తప్ప మిగతా ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటా రూ.2,060లకు సాధారణ రకం ధాన్యం రూ.2,040లకు కొనుగోలు చేస్తామని చెప్పారు. ఖరీఫ్‌లో పంట నమోదు చేయించుకున్న రైతుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ఏవో చెప్పారు. రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏవో కోరారు.

'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజాంపట్నం: నిజాంపట్నంలోని మహాత్మా జ్యోతీరావు పూలే ఏపీ బీసీ గురుకుల కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వై.నాగమల్లేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ -60 సీట్లు, బైపీసీ-40 సీట్లు, సీఈసీ-40 సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మే 18 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మే 28న ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9866559636కు సంప్రదించాలని తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



ఐలవరం(భట్టిప్రోలు): ద్విచక్ర వాహనంపై వెళుతున్న తండ్రి కొడుకులు రోడ్డు ప్రమాదంలో గాయపడగా.. చికిత్స పొందుతూ కొడుకు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. ఐలవరానికి చెందిన జొన్నాదుల ఈశ్వర ప్రసాద్, అతని కుమారుడు గణేష్ శనివారం విజయవాడ బయలుదేరారు. తెనాలి వినాయకుని విగ్రహం వద్ద ఎదురుగా ఆటో అడ్డుగా రావడంతో.. వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఈశ్వర్ ప్రసాద్‌కు స్వల్ప గాయాలు కాగా గణేష్‌కు తల పైభాగం తీవ్రంగా దెబ్బతింది. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో.. గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. మధ్యాహ్నం చికిత్స పొందుతూ గణేష్ మృతి చెందాడు. గణేష్ స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు.

కాళికాంబ అమ్మవారి కొలుపులు ప్రారంభం



కర్లపాలెం: కర్లపాలెం గ్రామదేవత వీరభద్ర సమేత కాళికాంబ అమ్మవారి కొలుపులు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భక్తులు అమ్మవారికి బిందెలతో అభిషేకం చేశారు. సోమవారం కుంకుమ పూజ, అమ్మవారి నగరోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుని, మొక్కులు చెల్లించుకోవడంతో కొలుపులు ముగుస్తాయి. పెద పులుగువారిపాలెంలోని వీర్లంకమ్మ బురకాయలంకమ్మ అమ్మవార్లకు బుద్ధాం గ్రామంలోని పల్లాలమ్మ అమ్మవారి కొలుపులు ఘనంగా జరుగుతున్నాయి.

మాక్ టెస్ట్‌కు విశేష స్పందన



తెనాలిఅర్బన్: జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పాలిసెట్, ఎంసెట్ మాక్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. విద్యార్థులు అధిక సంఖ్యలో పరీక్షకు హాజరయ్యారు. అనంతరం కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జెట్టి విజయశేఖర్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రకాశం రోడ్డులోని కోచింగ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ ఉమాదేవి, కోటి, శివ, ఎబినైజర్ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరస్వామి జయంతి



తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో ఆదివారం బసవేశ్వర స్వామి జయంతి నిర్వహించారు. బసవేశ్వర స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ముఖ్య అతిథి బీజేఎస్ మూర్తి శివతత్వాన్ని, భక్తి మార్గాన్ని వివరించారు. ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, చుక్కా శ్రీనివాస్, భాను, గోపి సాయి, తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ



నిర్మాణ దశలో క్రాప రహదారి



నిర్మాణ పనులు పూర్తయిన రేపల్లె-తెనాలి రోడ్డు

- రూ. 12.80 కోట్లతో రోడ్ల నిర్మాణాలు
- తీరనున్న ప్రయాణ కష్టాలు..
- మూడు దశాబ్దాల తెనాలి-రేపల్లె గతుకుల రోడ్డుకు మోక్షం
- చురుగ్గా సాగుతున్న పనులు

కొల్లూరు: దశాబ్దాలు తరబడి అస్తవ్యస్తంగా ఉన్న రహదారులకు మోక్షం లభించింది. నూతన రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ. 12.80 కోట్ల అంచనా వ్యయంతో 33.50 కిలోమీటర్ల మేర అర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏళ్ల తరబడి ప్రయాణికులు ఎదుర్కొంటున్న కష్టాలు తీరనున్నాయి. నిరంతరం రద్దీగా ఉండే రేపల్లె-తెనాలి ప్రధాన మార్గంలో బాపట్ల జిల్లా వెల్లటూరు నుంచి గుంటూరు జిల్లా పెదరావూరు వరకు రూ.7.80 కోట్లతో 25.42 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పనులు పూర్తవడంతో ప్రయాణం సౌకర్యవంతమైంది. రూ.5 కోట్ల అంచనాతో 8 కిలోమీటర్ల మేర మండలంలోని క్రాప, చిన పులివర్రు రహదారి పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. ప్రభుత్వం రహదారుల నిర్మాణం చేపట్టడంతో ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుపడనుంది. అలాగే వేల ఎకరాల్లో సాగవుతున్న వరి, మొక్కజొన్న , వాణిజ్య పంటల రవాణా సులభతరం కానుంది.

మూడు దశాబ్దాలకు వీడనున్న రహదారిద్ర్యం

మూడు దశాబ్దాల నుంచి గతుకుల మయంగా మారిన రోడ్డులో ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్న క్రాప వాసులకు ప్రయాణం సులభతరం కానుంది. మంత్రి మేరుగ నాగార్జున చొరవతో ఎస్సీ, ఎస్టీ నిధులు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో తెనాలి-రేపల్లె ప్రధాన మార్గం నుంచి 3.40 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. రహదారి పనులలో భాగంగా ఏక కాలంలో పంట కాల్వలపై 3 కల్వర్టుల నిర్మాణాలు జరుగుతున్నాయి. 1997 ప్రాంతంలో నిర్మించిన ఈ బీటీ రోడ్డు ఏడాది కాలంలోనే దెబ్బతినడంతో.. అప్పట్నుంచి క్రాప వాసులు రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధుకు అర్జీలు దాఖలు చేసినా ప్రయోజనం కనిపించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ రోడ్డు పనులు ప్రారంభించడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయితే అనంతవరం నుంచి క్రాప మీదుగా కొల్లూరు చేరుకోవడానికి దగ్గర మార్గం ఏర్పడటంతో పాటు, వేమూరు మండలం వెల్లబాడు వాసులు రాకపోకలు సాగించేందుకు అనువైన మార్గంగా మారుతుంది.

రూ.3 కోట్లతో చినపులివర్రు రోడ్డు..

అధ్వానంగా తయారైన చిన పులివర్రు రహదారి నిర్మాణ పనులు చేపట్టడంతో ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. 2006లో నిర్మించిన రహదారి ఛిద్రమవడంతో ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని విధంగా మారిన ఈ మార్గంలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కొల్లూరు మండలం కోటిపల్లి నుంచి వేమూరు మండలం పెనమర్రు వరకు 4.68 కిలో మీటర్లు బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. 3 కల్వర్టుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు పనులు చేపట్టడం కారణంగా పెనమర్రు, చిన పులివర్రు, కోటిపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు 3వేల మంది ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. 1,500 ఎకరాలలో సాగవుతున్న వ్యవసాయోత్పత్తుల తరలింపు సులభతరం కానుంది. పెనమర్రు రైల్వే స్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ఈ ప్రాంత వాసులకు రోడ్డు మార్గం ఏర్పడనుంది.

జాప్యం లేకుండా పనులు

రహదారుల నిర్మాణ పనులు ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. సాంకేతిక కారణాల వల్ల పనులు కొంత ఆలస్యం అయినప్పటికీ నిర్దిష్ట సమయంలో పూర్తి చేయించడానికి నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. నాణ్యతా లోపాలు లేకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయిస్తాం.

– ఎం.నరసింహారావు, ఆర్అండ్‌బీ ఏఈ, కొల్లూరు.

గౌరీశంకర నాట్యమండలి రజతోత్సవం



దుర్యోధన మయసభలోని ఓ సన్నివేశం

బాపట్ల: స్థానిక సోమేశ్వర స్వామి ప్రాంగణంలో శ్రీ గౌరీ శంకర నాట్యమండలి స్థాపించి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం రజతోత్సవం నిర్వహించారు. సభలో ప్రఖ్యాత రంగస్థలం నటుడు కేఎస్‌టీ సాయి మాట్లాడుతూ.. సంస్థ నిర్వాహకుడు, ప్రముఖ రంగస్థల నటుడు మల్లికార్జునరావు ప్రతి వార్షికోత్సవం సందర్భంగా ఇద్దరు ప్రముఖ రంగస్థలం నటులను సన్మానిస్తున్నారని తెలిపారు. కళాకారులకు నూతన ఉత్సాహం కల్పిస్తూ రంగస్థలం నాటకాలపై అభిరుచి కలిగిస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్, నంది అవార్డు గ్రహీత డాక్టర్ పీవీ రామకుమార్, బాపట్ల రంగస్థలం పుస్తక రచయిత, రంగస్థలం కళాకారుడు మన్నే శ్రీనివాసరావును సంస్థ ఘనంగా సన్మానించింది. దుర్యోధన మయసభ, శ్రీకృష్ణ రాయబారం నాటకం నుంచి సెంట్రల్ సీను ప్రదర్శించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నిభానపూడి హరి ప్రసాద్, ఎస్వీఆర్ కుమార్, ఎస్వీఆర్ రాజేశ్వర శర్మ, బందా బాబు, నందనవనం శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్త్రీల ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు



బాపట్ల: బాపట్ల పట్టణం స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో స్త్రీల ఆదివారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టరమ్మ కటికల సూసన్న అధ్యక్షతన ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ కటికల విక్టర్ బాబు, స్త్రీలు కత్తి శ్యామలదేవి, జొన్నలగడ్డ వజ్రాదేవి, గేరా వరదానం తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీగా ప్రమాణ స్వీకారానికి..



ర్యాలీగా వెళ్తున్న సీతారామిరెడ్డి

కర్లపాలెం: బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసేందుకు ఆదివారం వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండలాధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులతో ర్యాలీగా బాపట్ల తరలి వెళ్లారు. కుటుంబ సభ్యులతో స్థానిక పెద్దింటమ్మ ఆలయానికి చేరుకుని, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌కు చేరుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ్య, పందరబోయిన సుబ్బారావు, వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, కర్లపాలెం, చింతాయపాలెం, సొసైటీ అధ్యక్షులు ఆట్ల రామచంద్రారెడ్డి, మరకా పెదవెంకటేశ్వర్లు, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

చర్చికి రూ.లక్ష విరాళం

కొల్లిపర: కొల్లిపర గ్రామం ఎస్సీ కాలనీలోని లూథరన్ చర్చి ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ చిలువూరి ఝాన్సీ, మాజీ ఎంపీటీసీ భీమవరపు సంజీవరెడ్డి, తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ జొన్నల శివారెడ్డి, రెవ పాస్టర్ సుమన్‌బాబు, సంఘ పెద్దలు కె.బాస్కరావు, ఎ.రామరావు, జి.శాంతి రాజు, మంద్రు రాజు, పిల్లి గంగాధర్, దేవ దత్తు, వైఎస్సార్ సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



తెనాలిఅర్బన్: హైదరాబాద్‌కు చెందిన ఈ-అభ్యాస్ అకాడమి వివిధ పాఠ్యాంశాలపై గతేడాది రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ పాఠశాల విద్యార్థులు 13 మంది ప్రతిభ కనబరిచి, మెమెంటోలు అందుకున్నారని స్కూల్ ఎండీ దాసరి మురళీకాంత్ తెలిపారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం ఈ-అభ్యాస్ వ్యవస్థాపకుడు డాక్టర్ భువనగిరి ఫణికుమార్ వీటిని అందజేసినట్లు చెప్పారు. అలాగే ఒలింపియాడ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని పాఠశాలకు అందించినట్లు వెల్లడించారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

'గడప గడపకు' మంత్రి మేరుగ నాగార్జున



సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

గోవాడ(వేమూరు): అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం జరిగింది. ప్రతి గడపకు వెళ్లిన మంత్రి మేరుగ నాగార్జున సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని వర్గాలకు సంక్షమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం సంక్షేమం గురించి పట్టించు కోలేదన్నారు. జన్మభూమి కమిటీలు ద్వారా కొంతమంది వ్యక్తులకే సంక్షేమ పథకాలు అందించారని మంత్రి విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించి, మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, ఎంపీటీసీ దేవరకొండ సత్యవతి, నూతల పాటి సురేష్, బేతపూడి రాజేష్, బద్దపూడి ఇస్రాయేలు, బెండెల చెత్తయ్య, పాములు హృతిక్, సీహెచ్ చౌదరి, మండవ శ్రీరామమూర్తి, ఆలపాటి రత్నగిరి, ఇర్మియ్య పాల్గొన్నారు.

చోడిపాలెంలో 'జగనన్నే మా భవిష్యత్తు'



స్టిక్కర్ అంటిస్తున్న నాయకులు..

పిట్టలవానిపాలెం: భవనంవారిపాలెం శివారు చోడిపాలెం ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, చందోలు బండ్లమ్మ, ధర్మకర్తలి మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ సాయాన్ని వివరించారు. స్టిక్కర్లను ఇంటి పెద్ద మద్దతుతో అంటించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వర స్వామికి అన్నాభిషేకం



వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో అగస్త్య మహా ముని ప్రతిష్ఠించిన బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో వైశాఖ శుద్ధ అక్షయ తృతీయ రోహిణి నక్షత్రం సందర్భంగా స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, లక్ష మల్లెల పూజ, అమ్మవారికి శ్రీ సూక్త విధాన కుంకుమ పూజలు జరిగాయి. కాశీభొట్ల విశ్వరాయశర్మ శిష్య బృందం అర్చకుడు బుద్దు సుందర శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈఓ దీవి వేంకట అప్పలాచార్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సూర్యలంక జన సంద్రం



పోటెత్తిన భక్త జన సంద్రంతో.. ఉప్పొంగిన సూర్యలంక సముద్రతీరం. తొలిపొద్దు వెచ్చని కిరణాలతో వికసించిన సంతోషాలు. కడలి కెరటాల స్పర్శతో తీరంలో కేరింతలు.. రంజాన్ అనంతరం ముస్లింలు, పర్యాటకులు ఆదివారం సముద్ర తీరానికి చేరుకున్నారు. తమ కుటుంబాలతో సంతోషంగా గడిపారు. లక్ష మందికి పైగా భక్తుల రాకతో సూర్యలంక తీరం..మరో సంద్రంగా మారింది.

బాపట్ల అర్బన్

బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసు ప్రారంభించిన ఎమ్మెల్యే కోన రఘుపతి దంపతులు

బాపట్ల: బాపట్ల జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేయటం ఎంతో సంతోషకరమని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ఆదివారం బాపట్ల టు హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు నాన్ ఏసీ స్లీపర్ సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, ఆర్టీసీ ఆర్ఎం విజయకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆకాశం మేఘావృతం..

రైతుల్లో కలవరం



భట్టిప్రోలులో మేఘావృతమైన ఆకాశం

కల్లాల్లో ఆరబెట్టిన పంట రక్షించుకొనేందుకు ఉరుకులు, పరుగులు

కొల్లూరు/భట్టిప్రోలు/బాపట్ల: వాతావరణ మార్పుల కారణంగా ఆకాశం మేఘావృతమై.. రైతులను కలవరానికి గురిచేసింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో నాలుగు రోజులుగా మబ్బులు కమ్ముకుంటుండటంతో జొన్న, మొక్కజొన్న పండించిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం వరకు ఉక్కపోత పోసింది. ఆ తరువాత ఒక్కసారిగా చల్లబడిపోయింది. మబ్బులు కమ్మాయి, తేలికపాటి జల్లులు పడ్డాయి. ప్రస్తుతం జొన్న, మొక్కజొన్న విరిచి కల్లాల్లో ఆరబెట్టి ఉంచారు. వర్షం పడితే.. నష్టం తప్పదని రైతులు చెబుతున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన పంటకు ఉరుకులు, పరుగుల మీద టార్పాలిన్ పట్టలు కప్పి..రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే పనిలో నిమగ్నమయ్యారు. భట్టిప్రోలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈదురు గాలులు వీచాయి. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు కొంతమేర అంతరాయం ఏర్పడింది. చల్లగాలులకు వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, ప్రజానీకం కొంత ఊరట చెందారు. మామిడి, నిమ్మ కాయలు నేల రాలాయి. బాపట్లలోని గోపాపురం గ్రామంలో సాయంత్రం 4 గంటల సమయంలో పిడుగుపడి వరిగడ్డివామి దగ్ధమైంది. సోమన వేణు అనే వ్యక్తికి సంబంధించిన రెండు ఎకరాల వరిగడ్డి బూడిదయ్యింది.



గోపాపురం పొలాల్లో పిడుగుపడి దగ్ధమవుతున్న వరిగడ్డి



కల్లాల్లో టార్పాలిన్‌లు కప్పి ఉంచిన మొక్కజొన్న



వెల్లటూరులో కల్లాల్లో ఆరబోసిన పసుపుపై కప్పిన పట్టలు



మొక్కజొన్న గింజలు బస్తాలకు ఎత్తుతున్న కూలీలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

బాపట్ల బాపట్ల పట్టణంలోని ఏబీఎం స్కూలులో 1976-77 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. మాస్టారు ఎ.ఎలీషా రావుకు.. ఏడుకొండలు అధ్యక్షతన ఉప్పాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఇష్టాగోష్ఠిలో నాటి మిత్ర బృందం తమ విజయాలను, అనుభూతులను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు విజయకుమారి, రాధరాణి, అంజనాదేవి, పంచాక్షరి, విజయలక్ష్మి, హర్షవర్ధన్, ఈమని కోటి, రఘురాం, వేణు, జితేంద్ర పాల్గొన్నారు.